www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 ఏప్రిల్ 2023

జిల్లా ఎస్‌పిగా డి.మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా ఎస్‌పిగా డి.మేరీప్రశాంతి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె విజయవాడ రూరల్ లా అండ్ ఆర్డర్ డిసిపిగా పనిచేస్తున్నారు. 2013వ బ్యాచ్ ఐపిఎస్‌కు చెందిన ఆమె తొలుత విజయనగరం జిల్లాలో డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం మహబూబ్‌నగర్ డిఎస్‌పిగా పనిచేస్తూ విజయవాడ ఇంటెలిజెన్స్ డిఎస్‌పిగా బదిలీపై వచ్చారు. విజయవాడలోనే సిఐడి విభాగంలో అత్యుత్తమంగా పనిచేశారు. ప్రస్తుతం జిల్లాకు ఎస్‌పిగా నియమితులయ్యారు. ఇక్కడ ఎస్‌పి పనిచేస్తున్న రాహుల్ దేవ్ శర్మ ఐదో బెటాలియన్ ఎస్‌పిగా బదిలీ అయ్యారు.

ఇరకాటంలో ఇరిగేషన్..!

కాలువలో పెరిగిన తూడు

డెల్టా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మౌనం

ప్రతిపాదనలు పంపినా సమాధానం కరువు

రూ.600 కోట్లకుపైగా పనులు పడక

15న కాలువల మూసివేతకు నిర్ణయం

కాలువలు పూడుకుపోయి ప్రతియేటా పంట నష్టం

మెయింటినెన్స్ పనులకైనా నిధులిచ్చేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

డెల్టా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జిల్లా రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పంట కాలువలు పూడుకుపోయి ప్రతియేటా ఖరీఫ్‌లో వేలాది ఎకరాల్లో పంట నష్టపోవడంతోపాటు రబీలో సాగునీటి కోసం అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఏడాది కూడా ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మౌనం వహిస్తోంది. కనీసం కాలువల మెయింటినెన్స్ పనులకైనా నిధులిస్తారా అని ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్ 15న పంట కాలువల మూసివేతకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూన్ ఒకటో తేదీన కాలువలకు తిరిగి సాగునీరు విడుదల చేయనున్నారు. దాదాపు రెండు నెలల 15 రోజుల సమయం ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్, రబీల్లో దాదాపు ఎనిమిది లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు సాగుతోంది. డెల్టాలో వరిసాగే ప్రధానంగా ఉంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా డెల్టా ఆయకట్టుకు సాగునీరు సరఫరా సాగుతోంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక జిల్లాలో డెల్టా కాలువల ఆధునికీకరణ పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. జిల్లాకు ఇద్దరు మంత్రులున్నా రైతులకు మేలు జరగని పరిస్థితి నెలకొంది. గడిచిన మూడేళ్లుగా జిల్లాలో డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తిగా పడకేశాయి. చిన్నచిన్న మెయింటినెన్స్ పనులు మినహా కాలువల పూడికగాని, షట్టర్లకు సంబంధించిన పనులుగాని ఏఒక్కటీ జరగని పరిస్థితి ఉంది. వైసిపి ఐదేళ్ల పాలనలో ఆధునికీకరణ పనులకు ఇదే చివరి ఏడాది. ఈ ఏడాదైనా ఎంతోకొంత ఆధునికీకరణ పనులు చేస్తారని రైతులు భావించారు. జిల్లాలో దాదాపు రూ.600 కోట్లు విలువైన ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. ప్రతియేటా ఇదేవిధంగా ప్రతిపాదనలు పంపడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం సర్వసాధారణమైంది. ఈ ఏడాది సైతం అదే పరిస్థితి కొనసాగుతోంది. మరో వారం రోజుల్లో కాలువలు మూసివేసే గడువు సమీపిస్తోంది. అయినప్పటికీ ఆధునికీకరణ పనులపై ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఆధునికీకరణ పనులు సంగతి పక్కన పెడితే కనీసం మెయింటినెన్స్ పనులకు సంబంధించిన నిధులైనా ఇస్తారా అనే బెంగ అందరినీ వెంటాడుతోంది. ప్రతియేటా కాలువలు, షట్టర్ల వద్ద మెయింటినెన్స్ పనులకు జిల్లాలో రూ.50 కోట్లు వరకూ ఖర్చవుతోంది. ఈ నెల 12న విజయవాడలో ఇరిగేషన్ శాఖ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో మెయింటినెన్స్‌కు సంబంధించిన నిధులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నిధులైనా జిల్లాకు సరిపడా కేటాయిస్తారా అనే అనుమానం నెలకొంది.

రైతులు నష్టపోతున్నా పట్టని ప్రభుత్వం

తమది రైతు ప్రభుత్వమని వైసిపి సర్కార్ గొప్పలు చెప్పడం మినహా రైతుల గురించి ఆలోచించిన పరిస్థితి లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డెల్టాలో కాలువలు మొత్తం పూడుకుపోయి సాగునీరు సక్రమంగా కిందకు పారని దుస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో చిన్నపాటి వర్షాలకు సైతం కాలువలు ఎగదన్ని పొలాలన్నీ నీట మునిగిపోతున్నాయి. దీంతో రైతులు పెద్దఎత్తున పంట నష్టపోతున్నారు. ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడులు పెట్టిన రైతులు పంటనష్టంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే నష్టపరిహారం రూ.ఆరు వేలు మాత్రమే. ఆ పరిహారం కూడా సాగు చేయని భూయజమానులకు ఇస్తున్నారు. జిల్లాలో 70 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. వీరంతా ప్రతియేటా పెద్దఎత్తున నష్టాలను చవిచూస్తున్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు జరిగితే పంటనష్టం జరిగే పరిస్థితి ఉండదు. రైతులకు అత్యంత అవసరమైన ఆధునికీకరణ పనులపై ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. దీంతో ప్రభుత్వ తీరుపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఎపి అమరావతి జెఎసి ఆధ్వర్యాన

ఉద్యోగుల ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎపి అమరావతి జెఎసి కార్యాచరణలో భాగంగా స్థానిక కొత్తబస్టాండ్ వద్ద ఎపి అమరావతి జెఎసి ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో డిమాండ్ల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఈనెల పదో తేదీన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిని అందిస్తామన్నారు. 11వ తేదీన ప్రతీ ఉద్యోగి సెల్‌డౌన్ కార్యక్రమం చేపడతామన్నారు. 12న కలక్టరేట్ వద్ద ఉద్యోగులు, పెన్షనర్లు ధర్నా చేపడతామన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు స్వచ్ఛందంగా ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ రద్దు చేయాలన్నారు. 15వ తేదీన సిపిఎస్ ఉద్యోగం చేస్తూ రిటైర్డ్ అయిన, మృతిచెందిన ఉద్యోగి కుటుంబాల పరామర్శ యాత్ర చేపడతామని వివరించారు. 18న కలెక్టరేట్ వద్ద సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ధర్నా చేపడతామని, ఈ కార్యక్రమాన్ని సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్ని సంఘాల వారు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా 20న ప్రతీ బ్యాంకుకు వెళ్లి

డిమాండ్ల ప్లకార్డులతో నిరసన

మేనేజర్లకు వినతిపత్రాలు ఇస్తామని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు, పెన్షన్ ఇవ్వడంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం విఫలమవడం వల్ల ఆ ఉద్యోగులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాల నిమిత్తం ఇఎంఐలను సకాలంలో జమ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యలను బ్యాంక్ మేనేజర్లకు తెలిపి వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ 25వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఒకటో తేదీన పెన్షన్లు అందించడంలో విఫలమవడాన్ని నిరసిస్తూ 27న రిటైర్డ్ పెన్షనర్ల పరామర్శ యాత్ర, 29న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి జెఎసి జనరల్ సెక్రటరీ బి.రాంబాబు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎ.ప్రమోద్‌కుమార్, అమరావతి జెఎసి వైస్‌ఛైర్మన్ సిహెచ్.వర్మ, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేణు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల అధ్యక్ష, కార్యదర్శులు కమల్, సాయినాథ్, పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహాలక్ష్మి, వివిధ సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.



స్పిల్‌వే నుంచి ప్రాజెక్టును పరిశీలిస్తున్న న్యాయవాదులు

'పోలవరం'ను పరిశీలించిన సుప్రీంకోర్టు న్యాయవాదులు

ప్రజాశక్తి - పోలవరం

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు జగదీష్ గుప్త, ఉమాపతి, శ్రీనివాస్ బృందం పోలవరం ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణం విషయంలో సుప్రీం కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఢిల్లీ నుంచి వచ్చిన ఈ సీనియర్ న్యాయవాదులు ప్రాజెక్టులో తొలుత స్పిల్ వే, ఎగువ, దిగువ కాపర్ డ్యాములు, పవర్ హౌస్, గ్యాప్-1 ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీనియర్ న్యాయవాది ఉమాపతి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు డిజైన్ తదితర అంశాలపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పోలవరం ప్రాజెక్టు పరిశీలించామని చెప్పారు. పనుల ప్రగతి, డిజైన్ తదితర అంశాలపై అవగాహన కోసం వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఇంజినీరింగ్ చీఫ్ సి.నారాయణరెడ్డి, సి.సుధాకర్‌బాబు, ఎస్‌పి నరసింహమూర్తి, డివిజన్-2 పి.వెంకటరమణ, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, పాండురంగయ్య పాల్గొన్నారు.

10న స్పందన యథాతథం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల పదో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ 'స్పందన' నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పది ఇంగ్లీష్ పరీక్ష

ప్రజాశక్తి - కలిదిండి

శనివారం జరిగిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ కొల్లాటి నరేష్ కుమార్ తెలిపారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలైన ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 165 మంది విద్యార్థులకు ముగ్గురు, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 247 మందికి ఒకరు, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-ఎ కేంద్రంలో 171 మందికి నలుగురు, బి కేంద్రంలో 170 మందికి ఒకరు, భాస్కర్‌రావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 132 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరయ్యారన్నారు. మొత్తం 885 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 875 మంది హాజరయ్యారన్నారు.

టి.నరసాపురం : మండలంలో పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఇఒ టి.రామ్మూర్తి తెలిపారు. మండలంలో మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో 526 మంది విద్యార్థులకు 521 మంది హాజరైనట్లు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో277 మంది, టి.నరసాపురంలో 170 మంది, అప్పలరాజుగూడెంలో 79 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా బొర్రంపాలెంలో ముగ్గురు, టి.నరసాపురంలో ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.

నూజివీడు రూరల్ : నూజివీడు మండల, పట్టణ పరిధిలో పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని విద్యాశాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు రాజమండ్రికి చెందిన ఎం.వెంకటరంగప్రసాద్ శనివారం రూ.1,00,116 విరాళంను దేవస్థానం ఎఇఒ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు విరాళ బాండ్‌ను అందించారు.

నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

17 మందికి గాయాలు - ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - ఉంగుటూరు

వాటర్ ట్యాంకర్ లారీని ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటనలో 17 మంది ఆర్‌టిసి ప్రయాణికులు గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని నాచుగుంట వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సుమారు 53 మంది ప్రయాణికులతో ఏలూరు బయలుదేరింది. నాచుగుంట వద్దకు రాగానే జాతీయ రహదారి మధ్యలోని డివైడర్‌పైన ఉన్న మొక్కలకు నీళ్లుపోస్తున్న వాటర్ ట్యాంకర్ లారీని వెనుకవైపు బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో బస్సులోని 17 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఆర్‌టిసి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30 నుంచి చినవెంకన్న వైశాఖమాస తిరుకళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల ఏడో తేదీ వరకూ ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖమాస తిరుకల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ వేండ్ర త్రినాథరావు తెలిపారు. 30వ తేదీన స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. నాలుగో తేదీన స్వామివారి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తామన్నారు. ఐదో తేదీన స్వామివారి రథోత్సవం జరుగుతుందన్నారు.

కలిదిండిలో 'జగనన్నే మా భవిష్యత్'లో నాయకులు

పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక పేటకలిదిండిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైసిపి నాయకులు శనివారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే జగన్ సిఎంగా ఉండాలని నాయకులు ప్రజలకు వివరిస్తున్నారు. ప్రతీ ఇంటికీ ప్రచార స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు నీలి సుమన్, చాన్‌భాషా, గృహ సారథులు బిరుదుగడ్డ శ్యామ్‌బాబు, యాళ్ల జీవరత్నం, సుబ్బలక్ష్మి, కృష్ణ, శిరీష, వాలంటీర్లు పాల్గొన్నారు.

భీమడోలు : ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు శనివారం సాయంత్రం అంబరుపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 133వ కొనసాగింది. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంటి భవానీరంగ, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సునీతామాన్‌సింగ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, స్థానిక సర్పంచి ఉదయభాను, షేక్ ఆజామ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

14న నూజివీడులో చంద్రబాబు రోడ్‌షో

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలో ఈనెల 14వ తేదీన టిడిపి అధినేత చంద్రబాబు రోడ్ షోను విజయవంతం చేయాలని మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను కోరారు. నూజివీడులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 14వ తేదీన గుడివాడ మీదుగా నూజివీడు చేరుకుని సాయంత్రం రోడ్ షో, సభ నిర్వహిస్తారన్నారు. అనంతరం పట్టణంలో రాత్రి బస చేయనున్నట్లు తెలిపారు. జగన్ రాక్షస పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు.

అన్ని తరగతుల ప్రజలు జగన్ పాలనలో దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో లేరన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిఎం జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

చెలరేగుతున్న మట్టి మాఫియా..!

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు - డ్రెయిన్ల గట్లనూ వదలని పరిస్థితి - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అనుమతులు లేకుండా మట్టి తవ్వి విక్రయిస్తూ కొందరు అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. రైతుల అవసరాల సాకుతో డ్రెయిన్ల గట్లను కూడా తవ్వేస్తూ మట్టిని తరలించుకుపోతున్నారు. కొంత మంది ప్రజాప్రతినిదులు, రాజకీయ నాయకులు మట్టి మాఫియ ఆవతారం ఎత్తి వ్యాపారం చేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరించడంతో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయి. ఈ తవ్వకాల తంతు వెనుక అధికార పార్టీ నాయకుల ఆశీస్సులు ఉండటంతో మట్టి దందా జోరుగా సాగుతోంది. ముదినేపల్లిలో చినపాలపర్రు ఆయకట్టు సమీపంలో పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ గట్టును మట్టి మాఫియా తవ్వేస్తుంది. డ్రెయిన్ గట్టును సగం మేర తవ్వేస్తూ మట్టిని ట్రాక్టర్లల్లో ఖాళీ స్థలాలు, లేఆవుట్లకు తరలిస్తూ భారీగా మట్టి వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అదేవిధంగా ముదినేపల్లిలోని పోల్‌రాజ్ డ్రెయిన్ వంతెన వద్ద తామరోలు డ్రెయిన్ గట్టును మట్టి మాఫియా ఐదు గజాల మేర గట్టును తవ్వేసి ట్రాక్టర్లల్లో మట్టిని తరలించుకుపోతున్నారు. పగలు, రాత్రీ తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులకు మట్టి మాఫియా నుంచి భారీగా ముడుపులు అందడంతో చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం నుంచి వరుస సెలవులు రావడంతో మట్టి మాపియా చెలరేగిపోతూ మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. మాఫియా డ్రెయిన్ల గట్లను సగం మేర తవ్వడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో డ్రెయిన్ల గట్లకు గండి పడే ప్రమాదం ఉంటుందని, దీంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆయకట్టు రైతులు కంగారుపడుతున్నారు. వైసిపి పెద్దల సహకారంతోనే ఇదంతా జరుగుతోందని పలువురు చెబుతున్నారు. ఈ డ్రెయిన్ల గట్లను అక్రమంగా తవ్వుతున్న విషయమై వివరణ అడిగేందుకు డ్రెయినేజీ ఎఇ రాజ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. సంబంధిత అధికారులు స్పందించి మట్టి మాఫియాపై తగిన చర్యలు తీసుకోవాలని, మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తవ్వేసిన డ్రెయిన్ గట్టు

మట్టిని తవ్వుతున్న జెసిబి



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ ప్రతాప్

జగన్‌కే ప్రజల మద్దతు : ఎంఎల్ఎ ప్రతాప్

ప్రజాశక్తి - ముసునూరు

నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సిఎం జగన్ అందరి మన్ననలు పొందుతున్నారని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని లోపూడి గ్రామపంచాయతీ శివారు బసవరప్పాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి, ఆందరికి ఆందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, నాయకులు బి.నరసింహారావు, పార్టీ మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, సర్పంచి పేరం కృష్ణ, సర్పంచులు రంగు ధనలక్ష్మిగాంధీ, రాజబోయిన శ్రీదేవిశ్రీనివాసరావు, చలసాని దామోదర్‌రావు, ఇన్‌ఛార్జిఎంపిడిఒ బసవరాజు అచ్యుతసత్యనారాయణ, తహశీల్దార్ దాసరి సుధ, పంచాయతీరాజ్ ఎఇ టివి.నరసింహారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఎండుమిర్చికి గిరాకీ

రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు చుట్టుపక్కల గ్రామాలైన సింహాద్రిపురం, చింతలవల్లి, జంగంగూడెం, పలు గ్రామాల్లో పండించిన ఎండుమిర్చికి ఇతర రాష్ట్రాల్లోనే కాకుండా, విదేశాల్లో సైతం మంచి డిమాండ్ ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలం నుంచి ఇదే పంటను పండిస్తున్న రైతులు ఎన్నో కష్టాలను, ఆటుపోట్లను ఎదుర్కొంటూ అకుంఠిత దీక్షతో మిర్చి పంటను సాగు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది లాభాలు వస్తాయనే ఆశతో ఎదురుచూస్తూ తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు.



వృద్ధాశ్రమాన్ని ప్రారంభించిన నిర్వాహకులు

తిమ్మనకుంటలో వృద్ధాశ్రమం ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎర్రంపేట పంచాయతీ తిమ్మనకుంట గ్రామంలో జీసస్ హెల్ప్ వృద్ధుల ఆశ్రమాన్ని శనివారం ప్రారంభించారు. పాస్టర్ కె.రాజశేఖర్, సిహెచ్.ఆనంద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వృద్ధుల ఆశ్రమంలో ఈ సందర్భంగా ప్రారంభ కార్యక్రమాలు అసోసియేషన్ సభ్యులు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా తమ వృద్ధాశ్రమం వృద్ధులకు సేవలు అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వృద్ధులు అందిపుచ్చుకునేలా స్వచ్ఛంద సంస్థల సభ్యులు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే 15 మంది వృద్ధులు ఆశ్రమంలో ఉన్నారన్నారు. పూర్తి వివరాలకు 7993919528 సంప్రదించాలని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బోల్తా పడిన ఆటో

కల్వర్టు కుంగి ట్రక్ ఆటో బోల్తా

మరమ్మతులకు గురైన రూ.పది లక్షల విలువైన ఫ్రిజ్‌లు, ఎసిలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ బుట్టాయగూడెం వెళ్లే రోడ్డు సమీపంలో డ్రెయినేజీపై నిర్మించిన కల్వర్టు కుంగిపోయి ఆటో బోల్తా పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు నుంచి ఫ్రిడ్జ్‌లు ఏసిలతో ట్రక్ ఆటో జంగారెడ్డిగూడేం దుకాణానికి బయలుదేరింది. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ వీరనాల మధుసూదన్ దారి తప్పి బుట్టాయగూడెం వెళ్లే రోడ్డులోని గంగిరెడ్డి చెరువు కళింగ కల్వర్టు వద్దకు చేరాడు. దారి తప్పిన విషయం గ్రహించి ట్రక్ ఆటోను వెనుకకు తిప్పుతున్న క్రమంలో కల్వర్టు కుంగిపోయి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మధుసూదన్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. అయితే సుమారు రూ.పది లక్షల విలువైన ఏసీలు, ఫ్రిజ్‌లు మరమ్మతులకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. గంగిరెడ్డిచెరువు సమీపంలో నాసిరకంగా డ్రెయినేజీ, కల్వర్టు నిర్మాణాలు చేపట్టడం వల్ల కోతకు గురై కుంగిపోయిందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అప్పలరాజుగూడెం గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తన సిబ్బందితో పేకాట శిబిరంపై శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.89 వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

స్థానిక తంగెళ్లమూడి ద్వారకానగర్‌లో రాత్రివేళ కొందరు మద్యం మత్తులో ఇద్దరిపై దాడికి పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఏలూరు రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణబాబు తెలిపారు. శనివారం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో నిందితుల వివరాలను ఆయన తెలిపారు. ఈనెల మూడో తేదీ రాత్రి ద్వారకానగర్‌లో మద్యం మత్తులో ఉన్న కొందరు వ్యక్తులు మోటారు సైకిళ్లు రోడ్డుగా అడ్డుగా పెట్టడంతో అటుగా వెళుతున్న వారితో గొడవ జరిగింది. ఈ గొడవలో బీడీ కాలనీకి చెందిన పులవర్తి ధనుష్ నవీన్ కుమార్, బంటుపల్లి గిరినరసింహారావును కొట్టినట్లు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు ఆదేశాల మేరకు ఏలూరు వన్ టౌన్ సిఐ బోణం అదిప్రసాద్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఏలూరు బాలయోగి వంతెన ప్రాంతానికి చెందిన గౌతు శేషు, చాణక్యపురి కాలనీకి చెందిన నేల మధుబాబు, రావాడ దేవేంద్ర, కారు నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం సేకరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని విఆర్ఒ బాజీ తెలిపారు. శనివారం స్థానిక పద్మ థియేటర్ సమీపంలో కొండాపూ శ్రీనివాస్ ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యం సేకరిస్తున్నట్లు సమాచారం అందిందని విఆర్ఒ బాజీ తెలిపారు. సంఘటన ప్రాంతానికి చేరుకుని ఆటోలో ఉన్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, ఆటోను స్వాధీనం పరుచుకుని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అక్రమ నిర్మాణం నిలిపివేయాలి

పోలీసులకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక 19వ డివిజన్ సుందరయ్య కాలనీ (పాత వెంకటాపురం పంచాయతీ) వద్ద సెయింట్ పీటర్ ప్రోవెన్షియల్ ఫాదర్లు పేదల ఇళ్ల ఎదుట దౌర్జన్యంగా, అక్రమంగా ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ 19వ డివిజన్ సుందరయ్య కాలనీలో 2007 నుంచి పేదలు 250 మంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారన్నారు. సదరు కాలనీకి ప్రభుత్వం వారు రోడ్డు, మంచినీరు, కరెంటు వగైరా వసతులు కల్పించారన్నారు. కాలనీ మధ్యలో సెయింట్ పీటర్స్ ప్రావిన్స్ ప్రొవిన్సియల్ హౌస్ పాస్టర్ల ట్రైనింగ్ సెంటర్ ఉందన్నారు. సదరు ట్రైనింగ్ సెంటర్‌కు దేశ, విదేశాల నుంచి ఎవరెవరో వచ్చి వెళ్తూ ఉంటారన్నారు. ప్రొవిన్షియల్ హౌస్ ట్రైనింగ్ సెంటర్‌కి వచ్చి వెళ్లేవారికి పేదల ఇళ్లు అసహ్యంగా, అభ్యంతరకరంగా ఉన్నాయని, చాలాకాలంగా తమను అసహ్యించుకుంటున్నారని చెప్పారు. మాటలతో దుర్భాషలాడుతున్నారన్నారు. ఈ నెల ఏడో తేదీన చర్చి గోడకు తమ కాలనీ ఇళ్లకు మధ్య ఉన్న ఖాళీస్థలంలో గోడ నిర్మించారన్నారు. ఖాళీస్థలంలో గోడకదా అని తాము సరిపెట్టుకున్నామన్నారు. కాని శనివారం చర్చి ఫాదర్లు అన్యాయంగా, అక్రమంగా, దౌర్జన్యంగా పేదల ఇళ్లు మూసివేసే విధంగా గోడను నిర్మిస్తున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమకు అనుమతులు ఉన్నాయని, దిక్కు ఉన్న చోటు చెప్పుకోండని చర్చిలోని మనుషులతో పేదలపై దౌర్జన్యం చేశారన్నారు. తమ పార్టీ కార్యాలయం స్థలంతో సహ గోడ నిర్మాణానికి పునదులు తవ్వారన్నారు. ఇనుప రాడ్స్ ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయంపై విచారణ చేపట్టి పేదల ఇళ్లు ముందు దారి మూసివేసే విధంగా ప్రభుత్వం స్థలంలో సెయింట్ పీటర్స్ ప్రొవెన్షియల్ హౌస్ ఫాదర్లు అక్రమంగా, అన్యాయంగా, దౌర్జన్యంగా నిర్మిస్తున్న గోడ నిర్మాణాలు నిలుపుదల చేసి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.సూర్యకుమారి, జి.దేవిరాజేశ్వరి, పి.జయలక్ష్మి, డి.దుర్గమ్మ పాల్గొన్నారు.

పేదల ఇళ్లు ముందు అక్రమంగా చేపట్టిన గోడ నిర్మాణం

'టిడిపి హయాంలోనే అభివృద్ధి'

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

టిడిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వెంకటాయపాలెం, కొత్తూరు, ఓగిరాల తాండ గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. టిడిపి హయాంలోనే అభివృద్ధి జరిగిందని చెప్పారు.

ఐఎఫ్‌టియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలి

ఏలూరు: కార్మిక, ఉద్యోగ వర్గానికి సరైన దిశా నిర్దేశం చేసే లక్ష్యంతో ఈనెల 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో నిర్వహిస్తున్న ఐఎఫ్‌టియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం సాయంత్రం ఏలూరులో హమాలీలు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎంహెచ్ఎ హాలు సెంటర్ నుండి బయలుదేరిన ర్యాలీ బిర్లాభవన్, చందన బ్రదర్స్, పెద్ద వంతెన, మెయిన్ బజార్, పాత మార్కెట్, కన్నయ్య పార్కు మీదుగా ఆర్‌కె సెంటర్ వరకు నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్మిక హక్కులను హరించే ప్రభుత్వ విధానాల పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు హమాలీ ముఠా కార్మిక సంఘం, జట్టు కార్మిక సంఘం, కూరగాయలు ముఠా కార్మిక సంఘం ఈ ర్యాలీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలనీ, హమాలీ కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన సమగ్ర చట్టం చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నగర నాయకులు జగ్గపు రమణ, మంగం అప్పారావు, డి.వీరినాయుడు, నౌడు నెహ్రూబాబు, బి.వీరభద్రం, ఈశ్వరరావు, అన్నవరం, చందక అప్పారావు, తిరుపతిరావు, సూరిబాబు, రమణ పాల్గొన్నారు.

బిజెపి ప్రజావ్యతిరేక విధానాల తిప్పికొట్టాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

ఏలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వినాశకర విధానాలపై పోరాటానికి ప్రజల మద్దతు కూడగట్టడానికి ఈనెల 14 నుండి 30వ తేదీ వరకూ నిర్వహిస్తున్న ప్రచార జాతాను విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ జిల్లా కార్యవర్గం, జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రధాని మోడీ అధికారం చేపట్టిన తర్వాత ఆయన దత్తపుత్రులు అదానీ, అంబానీలకు ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. అదాని వ్యవహారంలో 19 ప్రతిపక్ష పార్టీలు జెపిసితో విచారణకు డిమాండ్ చేస్తే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. వేల కోట్లు దోచుకుని విదేశాలకు పారిపోయిన పారిశ్రామికవేత్తలందరూ గుజరాతీయులేనని వారికి మోడీ సర్కారు అండగా నిలుస్తుందని విమర్శించారు. డొల్ల కంపెనీలతో ప్రభుత్వాన్ని మోసగించిన ఆదానీని వెంటబెట్టుకుని మోడీ విదేశాలకు తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోద్రా అల్లర్ల సందర్భంగా నాడు జరిగిన సంఘటనలను డాక్యుమెంటరీ రూపంలో ప్రసారం చేసిన బిబిసిపై ఇడి దాడులు నిర్వహించడం అన్యాయమన్నారు. వాస్తవాలు వెల్లడిస్తున్న సంస్థలు, ప్రత్యేకించి విపక్ష నేతలు, ప్రశ్నించే గొంతుకలపై దాడి చేయడం, ఇడి, సిబిఐని ఉపయోగించడం మోడీ దాష్టీకానికి నిదర్శనమని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మత బీజం నాటే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాల్లో సవరణలు చేస్తున్నారని దేశ చరిత్ర, రాజకీయాలు, సామాజిక శాస్త్రాలు మతం రంగు పులుముకుంటున్నాయని, మతతత్వాన్ని నూరిపోసేలా పాఠ్యాంశాలను పొందుపరుస్తున్నారని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొట్టి లౌకిక వ్యవస్థకు తూట్లు పొడుస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో తన అస్తవ్యస్త విధానాలతో అరాచక పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.

వైద్యుల నిర్వాకం

సర్జరీ పరికరాన్ని చేతికి కలిపి కట్టు కట్టిన వైనం

ఇన్ఫెక్షన్‌తో చేయి మొత్తం తీసేయాల్సిన పరిస్థితి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పాము కాటుకు గురైన మహిళ వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు చికిత్స చేసి ఓ సర్జరీ పరికరాన్ని చేతికి వేసి కట్టారు. దీంతో ఇన్ఫెక్షన్ రావడంతో చేయి మొత్తం తీసేయాలని వైద్యులు సూచించడంతో బాధిత మహిళ ఆవేదన చెందుతోంది. విసన్నపేట గ్రామానికి చెందిన నంది పాము సురేష్ భార్య తులసి చేతిపై మూడు రోజుల క్రితం పాము కాటుకు గురైంది. దీంతో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. అక్కడ వైద్యులు చికిత్స చేసి కట్టు కడుతూ ఓ సర్జరీ పరికరాన్ని చేతికి వేసి కట్టారు. దీంతో శనివారం చేయి నొప్పిగా ఉందని మళ్లీ ఆసుపత్రికి వెళ్లగా విషయం తెలిసింది. చేయి పూర్తిగా ఇన్ఫెక్షన్ అయిందని, ఇప్పుడు చేయి మొత్తం తీసేయాలని అంటున్నారని తులసి ఆవేదన చెందుతుంది. తనకు జరిగిన అన్యాయానికి వైద్యులే బాధ్యత వహిం చాలని, తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.

సమ సమాజ స్థాపనకు నడుం బిగించాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకుని హెచ్చుతగ్గులు లేని సమ సమాజాన్ని నిర్మించడానికి యువత నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను పురస్కరించుకుని ఆయన నివాసంలో శనివారం మాట్లాడారు. మార్పు కోసం యువత ప్రశ్నించకపోతే దేశం స్వార్ధపరుల గుప్పెట్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. జ్యోతిరావుపూలే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చత్రపతి సాహు మహారాజ్ పెరియర్ ఇవి రామస్వామి మహర్షి నారాయణ గురు వంటి అనేక సామాజిక విప్లవ యోధులు భారతదేశంలో సమ సమాజ స్థాపన కోసం ప్రశ్నించి పోరాడడం వల్లే ఇంతటి మార్పు సాధ్యమైందన్నారు. బుద్ధుడు వర్ణ వ్యవస్థకు నిరసనగా నూతన భావజాల వ్యాప్తిని సంఘ నిర్మాణాన్ని ముందుకు నడిపి కీర్తికడించారన్నారు. పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్ సమాజంలోని దురణ్యాయాన్ని, అసమానతలను ప్రశ్నించి భావితరాలకు మార్గదర్శకులు అయ్యారని వివరించారు. ఏప్రిల్ 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న మహాత్మ పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిఉత్సవాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని మహానుభావుల భావజాల వ్యాప్తికి కృషి చేస్తూ ప్రశ్నించడం అలవాటు చేసుకుని ప్రశ్నిస్తూ సమ సమాజ నిర్మాణాన్ని స్థాపించడం కోసం కృషి చేయాలన్నారు. అప్పుడే అందరూ అన్నింటిలో సమానంగా ఎదగగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ మండవల్లి కోశాధికారి దాసరి యోహానురాజు, గాలి నాగయ్య, వట్టిప్రోలు సుధీర్, గోరింక గాంధీ పాల్గొన్నారు.

వంతెన పున:నిర్మాణ పనులు ప్రారంభం

తొలగనున్న గుండుగొలను ప్రజల కష్టాలు

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద శిథిలమైన వంతెన పున:నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పాత వంతెనస్థానంలో కొద్దిపాటి మార్పులతో నూతన వంతెన నిర్మాణానికి సుమారు రూ.నాలుగు కోట్లు మంజూరయ్యాయని జాతీయ రహదారుల శాఖ రాజమండ్రి డివిజన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్ర తెలిపారు. శతాబ్ద కాలం క్రితం ఏలూరు కాలువపై నిర్మించిన వంతెన శిథిలమై కూలిపోవడంతో స్థానిక శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు సహకారంతో గుండుగొలను ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు వంతెన నిర్మాణానికి కృషి చేశారు. కానీ ఆ నిర్మాణాన్ని చేపట్టాల్సిన రోడ్లు భవనాల శాఖ వద్ద నిధుల కొరత, వంతెన నిర్మాణానికి ఎక్కువ సమయం కోరడం, ఇతర కారణాల వల్ల వంతెన పనులు నిలిచిపోయాయి. ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు శాసనసభ్యులు శిథిలమైన వంతెనకు కొద్దిపాటి దూరంలో ఏలూరు కాలువపై బెయిలీ వంతెన నిర్మించారు. ప్రస్తుతం దానిపై రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ దశలో గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం అత్యవసరం కావడంతో ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు చొరవతీసుకుని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తరువాత జాతీయ రహదారుల శాఖను సంప్రదించారు. దీనిపై స్పందించిన జాతీయ రహదారుల శాఖ సుమారు రూ.నాలుగు కోట్లు సంస్థ నిధులతో వంతెన నిర్మాణానికి ముందుకు వచ్చింది. ఈ పనులను జాతీయ రహదారులశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

పనులు చేపడుతున్న అధికారులు

డ్రెయిన్ల క్రమబద్ధీకరణకు చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పంచాయతీ పరిధిలో తరచూ ముంపునకు గురవుతున్న ఆవాస ప్రాంతాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నట్లు గ్రామసర్పంచి పి.సునీతామాన్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు గ్రామపంచాయతీకి చెందిన మూడు లక్షల నిధులతో వర్షాకాలంలో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న 20 ప్రాంతాల్లో తూరలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పనులను శనివారం ప్రారంభించామన్నారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే క్రమంలో కొన్నిచోట్ల సిమెంట్ రోడ్లు వేశారు. మరికొన్ని చోట్ల రోడ్లను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో రోడ్డుకు రెండు వైపులా మురుగునీటి పారుదల వ్యవస్థను అనుసంధానం చేసే కార్యక్రమాలు జరగనందువల్ల వర్షాకాలంలో ఆ ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ పాలకవర్గం అలాంటి ప్రాంతాల్లో రోడ్డుకు రెండు వైపులా ఉన్న మురుగునీటి కాలువలను అనుసంధానం చేసే కార్యక్రమాలను చేపట్టామని సర్పంచి తెలిపారు. దీనివల్ల గ్రామంలోని కొన్ని ప్రాంతాలు ముంపు సమస్య నుంచి బయటపడతాయని సర్పంచి తెలిపారు.

మురుగునీటి పారుదలకు తూరలు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది



ఉంగుటూరులో..



ఏలూరులో..

'జగనన్నే మా భవిష్యత్తు'కు ప్రజల ఆదరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని నారాయణపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ చాలా బాగుందని వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు అన్నారు. నారాయణపురంలో శనివారం నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వాలంటీర్లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు: నగరంలో పలుచోట్ల 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని వైసిపి నాయకులు, గృహసాధరలు, వాలంటీర్ల శనివారం నిర్వహించారు. స్థానిక 50వ డివిజన్ అరుంధతి కాలనీ సచివాలయ కన్వీనర్ మనుకొండ శ్రీను ఆధ్వర్యంలో గృహసారథులతో కలిసి గడపగడపకూ తిరిగి జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లను గోడలకు అతికించారు. పార్టీ అధిష్టానం రూపొందించిన కరపత్రాన్ని చదివి వినిపించారు.

వర్షాలకు వరి పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

అకాల వర్షాలకు కంకులు ఎండిపోయి పంటమొత్త తాలుగింజలు వచ్చి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక చొదిమెళ్ల గ్రామంలో దొండపాడు చెరువు ఆయకట్టులో ఎనిమిది ఎకరాల్లో సాగు చేసిన వాడపల్లి సాంబశివరాజుకు చెందిన వరికంకులు ఎండు తెగులుతో జరిగిన పంట నష్టాన్ని రైతు సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. నష్టం వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంట ఈనిక వచ్చిన తర్వాత గింజ తయారు కాకుండా పంట అంతా తాలు రావడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడని చెప్పారు. ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారని ఎనిమిది ఎకరాలకు రూ.2.50 లక్షల పెట్టుబడి అయిందన్నారు. కంకిపాలు పోసుకుని గింజ తయారై పంట కోతకు వచ్చే దశలో కంకులు ఎండిపోవడంతో వచ్చిన తెగులు ఏమిటో కూడా అర్థం కాక వరి దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వెంటనే పర్యటించి పరిశీలించి తెగులు నిర్ధారణ చేసి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల పదో తేదీన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతు వాడవల్లి సాంబశివరాజు, రైతుకు మద్దతుగా వాడవల్లి కొండప్ప, వాడవల్లి స్వామి, వి.సాయి, వి.మణికంఠ, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

In The Court Of The 2nd Addl. Junior Civil Judge Cum 2nd Addl. Judicial Magistrat of 1st Class Tadepalligudem, W.G.Dt.

O.S.No. 351/2022

Between:

Sri Vijaya Lakshmi Speciality Cemicals, Rep. by its Proprietor Maddula Srinivasa Rao.

...Petitioner /Plaintiff

AND

M/s. Vaishanavi Impex, Rep. by its Managing Director P.Nageswara rao and 3 others.

...Respondents /Defendants

Respondents /Defendants 2 and 3:

2) M/s. Ragha Business Solutions having Its Manufacturing units at D.No. 3-149, Side Masid Rooms, Kagithala Penta, Kadapa, Kadapa District.

3) Paleti Nageswara Rao, S/o. Krishna Murthy Chowdary, Hindu, Male aged about 59 Years, M/s. Vaishnavi Impacts and M/s. Ragha Business Solutions, D.No. 1-115, Lakshminagar, H/o. Marapalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt /B.M.D.

పైన తెలుపబడిన దావా, పిటీషనులో రెస్పాండెంట్సు /ప్రతివాదులు 2 మరియు 3 వార్కి శ్రీ కోర్టు వారు మిమ్ములను పైన పేర్కొన్న కోర్టుకి హాజరు కమ్మని, అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా పై నెంబరు దావా గ్రంథములో దావా సమన్లు పంపిననూ, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటలేదు. అందుచేత శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది మీరు **ది.17-04-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై, మీ అభ్యంతరములు తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల ఎక్స్ పార్టీ చేచి మీ పరోక్షమున తీర్మానిండమగును.

వాయిదా తేదీ: ది.17-04-2023

వి.వి.సాయిరామారావు
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 93953 86956

ఎ.సుభాకరరావు
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.
సెల్: 94401 05513

తాడేపల్లిగూడెం,
05-04-23.

In The Court Of The Principal Junior Civil Judge Cum Judicial Magistrat of 1st Class Tadepalligudem, W.G.Dt.

O.S.No. 352/2022

Between:

Sri Vijaya Lakshmi Speciality Cemicals, Rep. by its Proprietor Maddula Srinivasa Rao.

...Petitioner /Plaintiff

AND

M/s. Vaishanavi Impex, Rep. by its Managing Director P.Nageswara rao and 3 others.

...Respondents /Defendants

Respondents /Defendants 1 to 4:

1) M/s. Vaishnavi Impacts having Its Manufacturing units at D.No. 1-11, Lakshminagar, H/o. Marampalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt. / B.M.D.

2) M/s. Ragha Business Solutions having Its Manufacturing units at D.No. 3-149, Side Masid Rooms, Kagithala Penta, Kadapa, Kadapa District.

3) Paleti Nageswara Rao, S/o. Krishna Murthy Chowdary, Hindu, Male aged about 59 Years, M/s. Vaishnavi Impacts and M/s. Ragha Business Solutions, D.No. 1-115, Lakshminagar, H/o. Marapalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt /B.M.D.

4) Paleti Padmaja, W/o. Paleti Nageswara Rao, Hindu, Female aged about 56 Years, Director of M/s. Vaishnavi Impacts and M/s. Ragha Business Solutions, D.No. 1-115, Lakshminagar, H/o. Marapalli (V), Dwaraka Tirumala (M), W.G.Dt /B.M.D.

పైన తెలుపబడిన దావా పిటీషనులో రెస్పాండెంట్సు /ప్రతివాదులు 1 టు 4 వార్కి శ్రీ కోర్టు వారు మిమ్ములను పైన పేర్కొన్న కోర్టుకి హాజరు కమ్మని, అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారా పై నెంబరు దావా గ్రంథములో దావా సమన్లు పంపిననూ, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనుటలేదు. అందుచేత శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారము, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది మీరు **ది.21-04-2023 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై, మీ అభ్యంతరములు తెలియపరుచుకొనవలెను.** లేని ఎడల ఎక్స్ పార్టీ చేచి మీ పరోక్షమున తీర్మానిండమగును.

వాయిదా తేదీ: ది.21-04-2023

వి.వి.సాయిరామారావు
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 93953 86956

ఎ.సుభాకరరావు
అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.
సెల్: 94401 05513

తాడేపల్లిగూడెం,
05-04-23.